# బేబి



దాట్ల నారాయణమూర్తిరాజు

"మేస్టారూ, రేపు మా యింటికి రారూ" ముద్దుగా అడిగింది బేబి.

"ఎందుకు ..?" అనడిగాడు చిరంజీవి.

"రేపు ... నా పుట్టినరోజు...మా డాడీ మిమ్మల్ని తీసుకురమ్మన్నారు..."

"అలాగా..." అన్నాడు చిరంజీవి. రెండు చేతులూ చాచి, ఎత్తుకుని ఒక్కసారి బేబీని ముద్దుపెట్టుకున్నాడు.

కిలకిలా నవ్వింది బేబి.

"మీ ఇల్లెక్కడో నాకు తెలీదే...

ఎలాగ." అమాయకంగా ముఖంపెట్టి అడిగాడు చిరంజీవి.

బేబీ ఆశ్చర్యంగా ముఖం పెట్టి "నిజంగా తెలీదా ?" అంది.

"నిజం ... ఒట్టు" అన్నాడు.

కొంతసేపు గుర్తుచేసుకుంటు న్నట్టుగా మధ్యమధ్యలో ఆగుతూ బేబీ ఏవో ఆనవాళ్లు చెప్పింది.

బేబీ చెప్పినందుకైనా వెళ్లాలని నిర్ణయించుకున్నాడు చిరంజీవి. ఉదయం మళ్ళీ జ్ఞాపకంచేసింది కూడా. మరచి పోకుండా తప్పక వస్తానని చెప్పాడు.

— తనకోసం ఎదురుచూస్తుంటుంది.

గబగబా అడుగులేస్తూ నడుస్తు న్నాడు చిరంజీవి. బేబీ స్కూల్లో జాయినైన తొలిరోజు ఎందుకో జ్ఞాపకం వచ్చింది.

పట్టుపరికిణీని ఒకచేత్తో పట్టుకుని, రెండోచేత్తో పలకని పట్టుకుని, మెల్లగా కదులుతున్న కాలిమువ్వలసవ్వడితో వచ్చిన బేబీ ముఖంవేపు చూసిఆశ్చర్యపోయాడు.

ఆ చక్రాల్లాంటి కళ్ళు, సన్నగా నాజూగ్గా మొనదేలిన ముక్కు, చిన్ని పెదవులు, ఆపిల్ పండు రంగులో మెరిసే బుగ్గలు, గుండ్రటి మొహం, ఆ మొహంలో ఎప్పుడూ కనబడే నవ్వు, ఆ నవ్వు వెనకాతల పరుగులెత్తే ఉత్సాహం— ఏడేళ్ళ బేబీ.

"మీ స్కూల్లో బేబీని జాయిన్ చేసుకోవాలండి." బేబీని తీసుకొచ్చినతను చిరంజీవితో చెప్పి, బేబీని నమస్కారం చెయ్యమన్నాడు.

భయంగా చూస్తూ నమస్కారం చేసింది బేబీ. బెదురుగా అమాయకంగా తనవేపు చూస్తున్న బేబీ కళ్ళవేపు మొదటిసారిగా ఆ రోజే చూసింది తను. కానీ ఆ కళ్ళను ఎప్పుడో చూసినట్టు జ్ఞాపకం. ఆ కళ్ళకి తన ఎంతో దగ్గర సంబంధం వున్నట్టు... ఆ విశాల మైన కళ్ళ వెనకతల ఏదో తనకు తెలిసిన ముఖం కన్పించినట్టయింది.

బేబీ రూపంలో తను చూసుకున్నది వర్ధనిని. బేబీ ప్రతి కదలికలో వర్ధని తనకు గోచరించేది. నవ్వే ఆ నవ్వులో, కనురెప్పల్ని పక్కకు వంచి మాట్లాడే ఆ మాటల్లో, బుగ్గమీద అందమైన సొట్టతో, ఆ హుషారులో బేబీని చూస్తుంటే వర్ధని తనముందు వున్నట్టు అనిపించేది.

అందుకే —

బేబీ తనకెంతో దగ్గరయింది. తీరిక దొరికినప్పుడల్లా బేబీతో వూసులాడే వాడు తను. బెంచీబల్లమీద కూచో బెట్టుకుని వచ్చీరాని మాటలాడుతున్న బేబీతో కాలం గడిపేసేవాడు.

'మీ మమ్మీ పేరేం పేర'ని రెండు మూడుసార్లు బేబీని తనడిగేడు సందేహం తీరడానికి. 'మా మమ్మీ పేరు...లీ...ల' అని చెప్పింది బేబీ. తన బెంగ సగం

తిరిపోయింది. బేబీ తల్లి వర్ధనికానందుకు. నిజంగా బేబీ తల్లి వర్ధని అయివుంటే –

ఎంత బాధపడేవాడు తను.

ఎంత కసి ప్రదర్శించేవాడు తను.

వర్ధని మీదున్న కోపాన్ని, నిర్దాక్షిణ్యంగా బేబీమీద చూపేవాడు. కానీ బేబీ వర్ధని కూతురు కాదు ! అందుకు సంతోషించేడు తను.

—దారంట నడుస్తున్న చిరంజీవికి వర్ధని జ్ఞాపకం వచ్చింది. వర్ధనిని, వర్ధని జ్ఞాపకాల్ని, ఆ పరిచయాన్ని ఏనాడో ఆ ఐదేళ్ళ కిందటే త్రుంచేసుకున్నాడు. పుట్టి పెరిగిన ఆ వూరికి వెళ్ళడం మానుకున్నాడు. అక్కడున్న మేనమామని, బంధువుల్ని చూడ్డానికి తల్లి వెళ్ళేదికాని; తను మాత్రం ఆ వూరు వెళ్ళకూడదని నిశ్చయించేసుకున్నాడు

ఆ నిర్ణయానికి కారణం – వర్ధని !

– ఆ స్వంత ఊళ్ళో చిరంజీవి మేనమామ గారింట్లో వుంటున్నపుడు, ఆ యింటికి రెండిళ్ళ అవతల వుండేది వర్ధని. ఆ వూరి స్కూల్లో వాళ్ళ నాన్నగారు లెక్కల మేస్టారు.

సన్నగా, పొడవుగా, నాజూగ్గా అందంగా వుండేది వర్ధని. వర్ధని అందానికి ముఖ్యకారణం ఆ విశాలమైన కళ్ళు. ఆ కళ్ళల్లోకి అలా చూస్తూ తను ఎంత సేపైనా అలా గడిపేసేవాడు.

ఔను —

ఆ రోజు తనకి బాగా జ్ఞాపకం వుంది. కార్తీకమాసం రోజుల్లో తోటలో ఆడవాళ్ళ మధ్య కబుర్లు చెప్తూ కూర్చుంది వర్ధని. తను దూరంగా స్నేహితులతో పేకాట ఆడి, విసుగెత్తి ప్రకృతిని చూడ్డానికి కొండలవేపు బయల్దేరాడు.

"చిరంజీవీ..." ఆ పిలుపు ఎవరిదో తనకు తెల్సు వగరు గొంతుతో కల్సిన పిలుపు వర్ధనిది.

"ఎటు" అని అడిగింది దగ్గర కొస్తూ.

చెప్పాడు తను.

"అయితే పద" అని తనవెంట బయల్దేరింది. ఆ రోజు తనకి అవకాశం చిక్కిందని సంతోషంతో వుక్కిరి బిక్కిరయాడు తను. ఎన్నాళ్ళబట్టో తన గుండెలో రగుల్తున్నకోరిక...తను వర్ధనిని ప్రేమిస్తున్నట్టు ఈ రోజైనా చెప్పెయ్యాలి. చెప్పేసి – లేతగులాబీ వన్నెలు దిద్దుకున్న ఆ బుగ్గపై తనే ప్రేమకు గుర్తుగా ముద్దుపెట్టుకోవాలి. తను ప్రేమిస్తున్నట్టుగా తెలిసి వర్ధని వుక్కిరిబిక్కిరవాలి.

వర్ధని పక్క నడుస్తూ ఆ మాటా, ఈ మాటా చెప్పి అసలు విషయంలో కొచ్చాడు

"నా మీద నీ అభిప్రాయం ఏమిటి వర్ధనీ...?" అని అడిగాడు తను.

తనవేపు చూసి చిక్కగా నవ్వింది.

వర్ధని. ఆ నవ్వులో ఎన్నో అర్థాలు వెతుక్కున్నాడు తను. నిజమే. వర్ధని తనను ప్రేమిస్తోంది. తన మనసు సంతోషంతో పులకించిపోయింది.

సన్నటి బాట.

తను ముందు నడుస్తున్నాడు.


వెనక వర్ధని నడుస్తోంది.

అటూ ఇటూ తుప్పలు, ముళ్ళు. చీర కుచ్చిళ్ళు ఎత్తి పట్టుకుని నెమ్మదిగా నడుస్తోంది వర్ధని. మడమకు ముల్లు గుచ్చుకుంది కాబోలు ఆగిపోయి 'అబ్బ' అంది.

"ఏం వర్ధనీ?" గాభరాపడ్డాడు తను.

"ముల్లు." బుగ్గల్ని ఎర్రగా చేసుకుంది.

"తీసేస్తా నుండు" అని నేలమీదకు వంగి వర్ధని ఎడమకాలు నా మడిచిన ముడుకుమీద పెట్టుకుని ముల్లు తీస్తూ ఆమె కళ్ళవేపు చూసాను. నా భుజమ్మీద చెయ్యివేసి నవ్వుతోంది వర్ధని. ఆ ముల్లు నాకు గుచ్చుకున్నట్టుగా ఫీలయ్యాన్నేను. ఈ అవకాశం వినియోగించుకోవాలని పించింది.



ముల్లు తీసేసి ఒక్కసారి వర్ధనిని ముద్దుపెట్టుకొన్నాను.

– అప్పుడు చూసాను వర్ధనిని నేను. హంపారుగా పొంగే ఆమె బుగ్గలు ఎర్రగా ఎరుపెక్కి, కాటుక కనుగుడ్ల చూపుల చివర కోపం కొత్తమెరుపు, తడియారని పెదవి పంట నొక్కిన విరుపులు – నన్ను గమ్మత్తు చెయ్యటానికి వర్ధని ఆ విధంగా ప్రవర్తిస్తుందను కున్నాను...కానీ అది నిజంగా కోపమని కొద్దినిమిషాలకే తెలిసింది.

పైట సర్దుకుని నావేపు సూటిగా చూస్తూ అంది.

"నువ్విలాటివాడివనుకోలేదుచిరంజీ.

నీతో చనువుగా తిరగడం నాది పొర పాటు ... నువ్విలాటివాడివని నేననుకో లేదు..." మెల్లగా ఒక్కొక్క మాటనూ ఒత్తుతూ మాట్లాడుతోంది వర్ధని.

"వర్ధనీ నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను తెల్సా ... నిజం... వర్ధని ... నువ్వొప్పుకుంటే పెళ్ళిచేసు కుంటాను..." ఎప్పట్నించో వర్ధనితో చెప్పుదామనుకున్న మాటలు చెప్పేసి ఆమె, కళ్ళవేపు చూసాను.

"నీతో పెళ్ళా?" చూపుల్ని నేల వేపుకి తిప్పుకుని అంది వర్ధని.

అదిరిపోయాన్నేను.

"ఏం..." మాటని రెట్టించి కసిగా అన్నాను.

చూపుల్ని నేలవేపుకి తిప్పుకుని ఆలోచిస్తున్న వర్ధని తలెత్తి ఒక్కసారి నావేపు చూసింది. ఆ చూపులో ఎంతో తేలికభావం కనిపించినట్టయింది.

ఎలిమెంటరీ స్కూలు మేస్టర్ని పెళ్ళి చేసుకుని సమాజంలో ఏ గుర్తింపూలేని బురద బ్రతుకు బ్రతకడం నా కిష్టం లేదు. అందుకే...వృత్తి మేస్టారి పెళ్ళి చేసుకుని నే నెలా సుఖపడగలను చెప్పు..." చులకనగా చూపుల్ని తుప్పల వేపు తిప్పుకుని అంది వర్ధని.

"ఏం మీ నాన్న మాస్టారుకాడా ... మినిష్టరా..." ఎత్తిపొడుపుగా అడిగేను.

"అవును మా నాన్న మాస్టారే... అందుకే మాస్టర్లంటే నాకు అసహ్యం... వాళ్ళ బ్రతుకంటే మరీ అసహ్యం... అందుకే ఆ వూబిలోంచి నేనైనా బయటపడాలని కోరుకుంటున్నాను..."

నాకు నోట మాటలు రావటంలేదు. నా వ్యక్తిత్వంమీద, నా అహమ్మీద దెబ్బతీసిన వ్యక్తి నేను ఎంతగానో ప్రేమిస్తున్న ఆడదైపోయింది !

వర్ధని మనస్తత్వం నా కర్థమైంది. ఆమెఎలాంటి జీవితాన్ని కోరుకుంటుందో, ఏ సుఖ జీవితాన్ని అనుసరించి ఆవిడ ఆశలు పయనిస్తున్నాయో అన్నీ నా కర్థ మయ్యాయి. కానీ మగవాణ్ణి, వేడెక్కించి, వెర్రెక్కించి, వుడికించి, వెక్కిరించే వర్ధనిలాటి ఆడవాళ్ళమీద నాకు సహజంగా కోపం ఏర్పడింది. అది వృత్తి కోపమని నేననుకోను. కసి. అంతే.

ఆ రోజే మా చివరి కలయిక. తర్వాత వర్ధని ఏమైందో నాకు తెలీదు. కానీ వర్ధని ఎవరో డాక్టర్ని పెళ్ళిచేసుకుని సుఖంగా వుంటోందని తెల్సినపుడు మాత్రం జీవితంలో వర్ధని ముఖం చూడ కూడదని, నా మేస్టారు మసక బతుకను చూసి, నాలో నేను అసహనంగా దిగబడి పోకూడదని అనుకున్నాను. కానీ ఏ మూలో రగులుకున్న వర్ధనిమీది ప్రేమ మాత్రం చావలేదు.

వర్ధని వూహల్లోంచి బయటికొచ్చిన చిరంజీవికి ఎదురుగా పెద్ద ఇల్లు. ఇంటి ముందు పచ్చగా పచ్చిక. గేటును తోసుకుని లోనికెళ్ళాడు చిరంజీవి.

"మాస్టారూ..." తుళ్ళుతూ బేబీ దగ్గరకొచ్చింది.

ఇల్లంతా ఎంతో సందడిగా వుంది.

బేబీకని ప్రత్యేకంగా కొన్న బహుమతిని చేతిలో పెట్టి ఎత్తుకుని ముద్దాడేడు బేబీని చిరంజీవి.

"మాస్టారూ...మా డాడీ..."డాడీని చిరంజీవికి పరిచయం చేసింది.

"మా బేబీ మీ గురించే చెబుతుంటుందండీ... మీరు రావడం మా అదృష్టం..." నవ్వుతూ కరచాలనం చేసాడు బేబీ తండ్రి.

"కూర్చోండి...ఇప్పుడేవస్తాను..." అనిచెప్పి ఎటో వెళ్ళాడాయన.

చిరంజీవి బేబీతో మాటల్లోకి దిగేడు.

స్వీటు హాటు తెచ్చిచ్చాడు పనివాడు. అదయ్యాక కోకాకోలా తీసుకున్నాడు. కొంతసేపు గడిచాక 'ఇక వెళ్లిపోదాం' అనుకుని లేచాడు చిరంజీవి. దూరంగా ఎవరితోనో మాట్లాడుతూ, తను లేచి పోవడం చూసి, దగ్గరకొచ్చి, "వుండండి చిరంజీవి...బేబీ మమ్మీని పరిచయం చేస్తాను." అన్నాడు బేబీ తండ్రి.

ఎందుకు అనిపించింది చిరంజీవికి. కానీ ఎందుకో చూడాలనిపించింది. ఆ చూడాలనే కోరిక కలగటానికి గల కారణం వర్ధని. వర్ధని పోలికల్ని పుణికి పుచ్చుకున్న బేబీ తల్లి ఎలా వుంటుందో ననే వుత్సాహమే చిరంజీవికి ఆవిణ్ణి చూడాలనిపించేట్టు చేసింది.

చిరంజీవికి బేబీ తల్లిని పరిచయం చేసాక, ఆ తర్వాత కొంతసేపయ్యాక వాళ్ళదగ్గర సెలవు పుచ్చుకుని వచ్చేసాడు.

మర్నాడు—

మామూలుగా స్కూలుకి వచ్చింది బేబీ. అలవాటుగా మేస్టారికి గుడ్ మార్నింగ్ చెప్పి కిలాకిలా నవ్వింది. బేబీ నవ్వుకి, మాటకి పరవశించిపోయే చిరంజీవి బేబీ ఎవరో తెలియనట్లు ప్రవర్తించాడు.

వర్ధని అసలుపేరు లీలావర్ధని అని మర్చిపోయినందుకు, బేబీ పోలికల్లో వర్ధనిని స్పష్టంగా గుర్తించికూడా, అమాయకంగా వాళ్ళింటికెళ్ళి వర్ధనిచేత 'మా బేబీ మాస్టారువి నువ్వేనన్నమాట' అని హేళనగా అనిపించుకున్నందుకు, ఆవిడ దగ్గర తను 'తక్కువతనం' ఫీలై వచ్చేసినందుకు అన్నిటికీ వుడుక్కొని, తనని తానే తిట్టుకుని వర్ధనిమీద కోపాన్ని, రగుల్తున్న కసినీ బేబీమీద చూపెట్టాడు చిరంజీవి.

—ఇవేవీ తెలియని బేబీ మనసు ఆ రాత్రెంతో బాధపడి జాలిగా కన్నీరు కార్చుకుంది.